క్లుప్తంగా

రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు. ఈక్రమంలో పాలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని నాయకులకు రేవంత్ రెడ్డి సూచించారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో బోడా వెంకన్న, కిషోర్‌నాయక్, హరినాయక్, షేక్.లాలు ఉన్నారు.

ఎలాంటి ఇబ్బందులు లేవు..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం అర్బన్ బాలికల పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో విద్యార్థినులు ఆహారం బాగా లేదనే కారణంతో ఆందోళన చేయలేదని వార్డెన్ చిలక నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు ఎవరూ కూడా శుక్రవారం నిరసన తెలపలేదని, భోజనం పారేయలేదని చెప్పారు. వర్షం కారణంగా నాలుగు రోజుల నుంచి చెత్తకుండీని శుభ్రం చేయకపోవడంతో పేరుకుపోయిందని తెలిపారు.

సన్మానం..



భవాని చౌదరిని సన్మానిస్తున్న కమిటీ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలిగా భవాని చౌదరి నియమితులయ్యారు. ఈమేరకు ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ నియామకపత్రం అందజేశారు. శనివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో ఆమెను దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈనేపథ్యంలో దివ్యాంగుల సమస్యలపై ఆగష్టు 7న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని ఎమ్మార్వో కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడతున్నట్లు నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జీవరత్నం, సుకన్య, క్రాంతి, రాము తదితరులు పాల్గొన్నారు.

పాణిరావు సేవలు మరువలేనివి

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బ్యాడ్మింటన్ అభివృద్ధికి పాణిరావు సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. శనివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో పాణిరావు మృతికి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన నివాళులర్పించిన సందర్భంగా వక్తలు మాట్లాడారు.ఈ సంతాప సభలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు తమ్మినేని వెంకటరావు, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు సిరిపురం సుదర్శన్, పాటిబండ్ల రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 'తీజ్' వేడుకలు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండా పంచాయతీ శివారు గ్రామమైన రేగుల గడ్డ చిన్నతండాలో శనివారం తీజ్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో నిర్వహించగా.. శనివారం ముగింపు రోజు కావడంతో తీజ్ బుట్టలతో స్థానిక చెరువు వద్దకు వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ విద్యుత్ డీఈఈ డి. కోటేశ్వరరావు, ఖమ్మం డీఈఈ టి.వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ తేజావత్ అనిత, గ్రామ పెద్దలు తేజావత్ రాందాసు, పి.రాజా, డి.వసంత్, డి.వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి



నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలను కవులు, రచయితలు, మేధావులు శనివారం ఖమ్మంలో ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న దాశరథి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమాఖ్య అధ్యక్షులు ములక సురేష్, జాషువా సాహిత్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు మువ్వా శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కవి డాక్టర్ ఆంజనేయులుతో పాటు దశరథ రామ్ కామిశెట్టి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వానలు జోరందుకున్నాయి. గత నాలుగైదు రోజులుగా పిలిస్తే పలుకుతుందన్న చందాన వర్షాలు కురుస్తుండడంతో ముసురు కమ్ముకుని బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో వానకు తడవకుండా జనం వివిధ రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో మార్కెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా, అనుగుణంగా ఉన్న ప్రత్యేక దుస్తులు, గొడుగులు, బ్యాగులు, టోపీలు, చెప్పులు అందుబాటులో లభిస్తున్నాయి. ట్రెండ్‌కు తగ్గట్టుగా మార్కెట్‌లో అన్ని వర్గాల వారిని ఆకర్షణీయంగా చూపించడంతో పాటు రక్షణ కల్పించేలా వివిధ డిజైన్లలో లభించడంతో వాటిని కొనేందుకు కొనుగోలుదారులు బారులుదీరారు. చినుకుకు చిక్కకుండా జనాలను రక్షించే వస్తువులపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– ఖమ్మంగాంధీచౌక్

జోరుగా గొడుగులు, రెయిన్ కోట్ల విక్రయాలు

- రకరకాల రంగులు, డిజైన్లతో ఆకట్టుకుంటున్న వైనం
- మోడల్, నాణ్యత ఆధారంగా ధరలు
- వాటర్ ప్రూఫ్ వస్తువులకు పెరిగిన డిమాండ్

చినుకుకు చిక్కకుండా..!

సండే స్పెషల్



ఖమ్మంలోని ఓ దుకాణంలో గొడుగులు, రెయిన్ కోట్లు, టోపీల విక్రయాలు

రకరకాల రంగుల గొడుగులు..

పిల్లలు మొదలు పెద్దల వరకు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా వివిధ రంగులు, సైజులు, డిజైన్లలో గొడుగులను విక్రయిస్తున్నారు. స్టార్, ఇంద్రధనస్సు, బ్లాక్, రెడ్ తదితర డిజైన్లు, రంగులతో తయారు చేసిన గొడుగుల అమ్మకాలు చేస్తున్నారు. చిన్న సైజు గొడుగులు బ్యాగ్‌లో పెట్టుకునే విధంగా కూడా లభిస్తున్నాయి.కాగా, గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా వాడే నల్లని గొడుగు రూ.150 నుంచి రూ. 200ల వరకు ఉండగా.. బ్యాగులు నాణ్యతను బట్టి రూ.100 నుంచి రూ. 400ల వరకు పలుకుతున్నాయి.

ఆరోగ్య రక్షణకు..

వాన నుంచి రక్షణ కోసం గొడుగులు, రెయిన్ కోట్లు, వాటర్ ప్రూఫ్ చెప్పులు, బూట్లు తదితరాలను వాడుతుంటాం. దీని వల్ల మనం తడవకుండా ఉండటమే గాక.. వర్షంలో తడిస్తే వచ్చే జలుబు, దగ్గు, తుమ్ముల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ ఉండడంతో వానకు తడవకుండా రక్షణ చర్యలు తీసుకుంటే వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చు.

ఆకర్షణీయంగా రెయిన్ కోట్లు..

వాన నుంచి రక్షణతో పాటు ట్రెండ్‌కు తగ్గట్టుగా ఆకర్షణీయంగా కనిపించేలా వివిధ రంగులు, డిజైన్లలో రెయిన్ కోట్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. చలి కాలంలోనూ ఉపయోగపడేలా జర్కిన్లను సైతం విక్రయిస్తున్నారు. ఒక్క రెయిన్ కోటు ధర రూ. 400ల నుంచి రూ. 2 వేల వరకు ధర పలుకగా.. ప్లాస్టిక్ రెయిన్ కోటు రూ. 200ల నుంచి రూ. 400ల వరకు, టోపీలు రూ. 100 నుంచి రూ. 150ల వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తున్నారు.

వాటర్ ప్రూఫ్ చెప్పులు, బూట్లు..

సాధారణ వాతావరణంలో విని యోగించే చెప్పులు వానాకాలంలో వినియోగానికి అనువుగా ఉండవు. వానకు వినియోగించే బూట్లు, చెప్పులు ప్రత్యేకంగా మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. సాండిల్స్, స్లిప్పర్లు, పియో చెప్పులు, బూట్లు విలువ రూ. 120ల నుంచి రూ. 500ల వరకు విక్రయిస్తున్నారు.

భరోసానిచ్చే బ్యాగులు..

విద్యార్థులు పుస్తకాలు తడవకుండా వాడే బ్యాగులు, ఉద్యోగులు తమ కార్యాలయాలకు టిఫిన్ బాక్సులు పెట్టుకునే బ్యాగులు ఇలా అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా భరోసానిచ్చే వాటర్ ప్రూఫ్ బ్యాగులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. సైజు, నాణ్యతను బట్టి ఒక్కో బ్యాగు ఖరీదు రూ. 150 నుంచి రూ. 2 వేల వరకు పలుకుతుంది.

ధరలు పెరిగాయి..



వానాకాలం సీజన్‌లో ప్రతి రోజు రెయిన్‌కోటు, గొడుగు తప్పక తీసుకెళ్తాను. పంటల కొనుగోళ్లు, మార్కెట్‌కు వెళ్లే సమయాన వానలో తడవకుండా ఉండేందుకు తీసుకెళ్తా. భిన్నమైన గొడుగులు, రెయిన్ కోట్లు లభ్యమవుతున్నప్పటికీ, ప్రజల అవసరాలను చూసి ఇదే అదనుగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు.

– బజ్జూరి రమణా రెడ్డి, అడ్తీ వ్యాపారి, ఖమ్మం

గొడుగు తీసుకెళ్లాల్సిందే..



నిత్యం పనికైనా, ఎక్కడకైనా వెళ్తున్నానంటే నా వెంట గొడుగు ఉండాల్సిందే. రోజూ పనిచేసుకునే వాళ్లం.. ఎప్పుడు వాన పడుతుందో తెలియదు కాబట్టి గొడుగుట తెచ్చుకుంటాం. వానకు తడిసి అనారోగ్యం తెచ్చుకునే బదులు ముందస్తుగా గొడుగు తెచ్చుకుంటాం. గొడుగు, రెయిన్ కోటు ఉంటే ఎంత వాన వచ్చినా పనికి వెళ్లగలుగుతాం.

– సీహెచ్.వెంకటనారాయణ, ఆరెకోడు, ఖమ్మం రూరల్

మణిపూర్ ఘటనపై నిరసనలు

మణిపూర్ ఘటన యావత్ భారతదేశం తల దించుకునేదిలా ఉందని, ఇందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణం అని ఆరోపిస్తూ శనివారం పలు మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టి, ర్యాలీలు తీశారు. ఇందుకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. మణిపూర్ సీఎం రాజీనామా చేయాలని, ప్రధాని మోదీ మహిళలకు క్షమాపణ చెప్పాలని ఆరోపిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టి బొమ్మలను దహనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కూసుమంచిలో నిరసన వ్యక్తం చేస్తున్న బహుజన నాయకులు



ఖమ్మంఅర్బన్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాపంథా నాయకులు

విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ



ల్యాప్‌టాప్ అందిస్తున్న చైర్మన్ కృష్ణ

ఖమ్మం సహకార నగర్: తమ కళాశాలకు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని వై.అనూహ్య మొదటి సెమిస్టర్ ఫలితాల్లో 9.4 జీపీఏ సాధించడంతో ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ ల్యాప్‌టాప్ బహూకరించారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థినికి అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు ప్రవీణ్‌కుమార్, శివప్రసాద్, సుభాష్ చందర్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.10వేలు వితరణ

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునర్నిర్మాణానికి మండల కేంద్రమైన కారేపల్లికి చెందిన గాలేటి స్వర్ణలత రూ.10,116లను శనివారం దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే, దేవాలయంలో నిత్యం కొనసాగే ప్రసాదం వితరణకు అవసరమైన కప్పులు, ప్లేట్లును ఓ స్టోర్ యజమాని ప్రజాపత్ అందించినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ కొమ్ము భాస్కర్ తెలిపారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న శ్రీకాంత్ రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: ఐఐటీ గౌహతిలో సీటు సాధించిన నల్లగొండ జిల్లాకు చెందిన నిరుపేద విద్యార్థి నారాయణ లిఖిత్‌రెడ్డికి ఖమ్మం గ్రేట్ సంస్థ రూ.89,000 ఆర్థిక సాయం అందజేసింది. ఖమ్మంలోని సంస్థ కార్యాలయంలో దానికి సంబంధించిన చెక్కును లిఖిత్‌రెడ్డి తండ్రి శ్రీనివాసరెడ్డి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ కోర్ కమిటీ సభ్యుడు వై.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతంగా చదివి పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆర్.అజిత్‌కుమార్ రెడ్డి, దగ్గుల మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, బలరాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బొగ్గుల వెంకట్రామిరెడ్డి, బి.శ్రీనివాస్‌రెడ్డి, కె.చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల నిమిత్తం..

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడికి చెందిన కంపాటి జ్యోత్స్న ఇటీవల రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈక్రమంలో ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం పలువురు దాతలు స్పందించి తమ వంతు ఆర్థిక సాయం అందించారు. శనివారం గ్రామ ఉపసర్పంచ్, బీజేపీ నాయకుడు గుత్తా వెంకటేశ్వర్లు రూ.10 వేలు, మండల రైతు సమితి కన్వీనర్ దొంతు సత్యనారాయణ రూ.2 వేలు అందించారు. ఇప్పటికే గ్రామంలోని పలువురు దాతలు తమకు శక్తి మేరకు యువతి వైద్యం కోసం సహాయం అందించినట్లు జ్యోత్స్న కుటుంబసభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ రామాయలం సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-5 ఏఈ ఆపరేషన్స్ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కమాన్‌బజార్, కస్బా బజార్, వల్లాలవారి వధి, షాదీఖానా ఏరియా, స్టేషన్ రోడ్, బొమ్మన సెంటర్, శాంతి లాడ్జ్ ఏరియా, వినోదా థియేటర్ ప్రాంతం, పాత మున్సిపాలిటీ ప్రాంతం, ఖిల్లా, శుక్రవారపు పేట, బ్రాహ్మణ బజార్, రిక్కాబజార్, చర్చి కాంపౌండ్, రామకృష్ణ నగర్, సుగ్గల వారి తోట, మేదర బజార్, అమ్మ భవాని దేవాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే నగరంలోని బురహాన్‌పురం 33/11 కేవీ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు బురహాన్‌పురం, మామిళ్లగూడెం, నెహ్రూనగర్, ఎన్‌ఎస్‌టీ రోడ్, లెనిన్ నగర్, బాలాజీనగర్, వైరారోడ్, బస్ డిపో రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఆపరేషన్స్ ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ఖమ్మంరూరల్: అర్హులైన పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ఎప్పుడూ అధికారం కోసం వెంపర్లాడలేదని, ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, కూలీలు, అన్ని వర్గాల ప్రజల వెన్నంటి ఉంటూ ఉద్యమాలు చేస్తున్నట్లు, భవిష్యత్‌లో కూడా ఇదే ఒరవడి కొనసాగిస్తూ ప్రజలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు కొంతమంది వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని దీనికి అడ్డుకట్ట వేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉచిత పశువైద్య శిబిరం

రఘునాథపాలెం: మండలంలోని దారేడు, జాన్‌బాద్‌తండా గ్రామాల్లో శనివారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ హరీష్‌రావు ఆధ్వర్యాన సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, వైద్య సిబ్బంది వరహాలు, ఖాజా పాషా, రవికుమార్, కృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేసిన మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.90 లక్షల వ్యయంతో బాక్స్ డ్రెయిన్ పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో నగరం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్, జక్కుల లక్ష్మయ్య, జక్కుల వెంకటరమణ, గుమ్మడివెల్లి శ్రీనివాసరావు, వల్లూరి విజయ్, డీఈ శ్రీనివాస్, ఏఈ శ్యామ్ మనోహర్, మేన మహేష్, ఆదినారాయణ, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్‌లో తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా 200 మొక్కల వరకు నాటుతున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్, డివిజన్ నాయకులు శ్యామ్, ఎండీ గౌస్, కట్టా రాణి, రమేష్, హుస్సేన్ ఖాన్, దమ్మలపాటి సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి..



వినతిపత్రం ఇస్తున్న పూసల కులస్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలులో తమ కులానికి ప్రభుత్వం ఇచ్చిన భూములను కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అట్టి ప్రయత్నాలను నిలుపుదల చేసి తమ వారసుల భూమిని తమ పేరిట చేయాలని కోరుతూ పూసల కులస్తులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావుకి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 210లో 16 ఎకరాల 15 కుంటల భూమిని తమ కులస్తులకు ప్రభుత్వం కేటాయించి 1977లో 23 మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చిందని, సంచారం చేస్తూ వ్యాపారం చేస్తున్న కొన్ని కుటుంబాలు గ్రామంలో లేరని, కొందరు మృతిచెందారని వివరించి తమకు న్యాయం చేయాలని కోరారు.కార్యక్రమంలో సత్యం, నారాయణ, రంగయ్య, వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



శ్రీనివాస్ తదితరులతో మాట్లాడుతున్న సంజయ్

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను మార్చడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఖమ్మంకు చెందిన కార్యకర్త గజ్జెల శ్రీనివాస్ చికిత్స అనంతరం కోలుకున్నాడు. ఈమేరకు ఆయన శనివారం కుటుంబంతో కలిసి కరీంనగర్‌లో సంజయ్‌ను కలిశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు నున్న రవికుమార్, శ్యాంరాథోడ్‌తో పాటు అల్లిక అంజయ్య, రవికిరణ్, వెంకట్, శ్రీనివాసరావు, డీకొండ శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని జీవన సంధ్య వృద్ధాశ్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన శనివారం ఉచిత వైద్య సేవలు అందించారు. అనంతరం మందులు అందజేశాక సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్ రావు వారికి రూ.1000లు, అలాగే డాక్టర్ హరినాథ బాబు రూ.500లు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జెల్లా వెంకటేశ్వర్లు, గజేంద్రుల నాగేశ్వరావు, ఉప్పలయ్య, ఎండీ.గౌస్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేపల కుంటల అభివృద్ధికి సహకరించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నేలకొండపల్లి: దళితల చేపల కుంటల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు వంగూరి ఆనందరావు కోరారు. మండలంలోని బైరవునిపల్లిలో శనివారం చేపల కుంట అభివృద్ధి సంక్షేమ సంఘం నూతన కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితులు ఐక్యంగా 50 ఎకరాల చేపల కుంటలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని,రాజకీయాలకు అతీతంగా దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం గత కమిటీతో పాటు నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు పెద్దపాక వెంకటేశ్వరావు, నూతన అధ్యక్షుడు పెద్దపాక రామదాసు, ప్రధాన కార్యదర్శి పెద్దపాక వెంకటేశ్వర్లు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుకు పాము కాటు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండలో శనివారం పొలంలో గడ్డి కోస్తున్న రైతు ఎం.ఉపేందర్‌ను పాము కాటు వేసింది. దీంతో స్థానిక రైతులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించాక ఖమ్మం తీసుకెళ్లారు.

17వ రోజుకు చేరిన జీపీ వర్కర్ల సమ్మె



నేలకొండపల్లిలో స్వీట్లు పంచుతున్న నాయకులు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలు పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు ప్రకటించి కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వం సంఘం నాయకులను చర్చలకు ఆహ్వానించడం పట్ల హర్షం వ్యక్తం చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

- సాక్షి నెట్‌వర్క్

అటెన్షన్ ప్లీజ్

సంతకు చినుకు చింత..!



మండలంలోని రాజేశ్వరపురం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన కూరగాయల సంత ఇటీవల నాలుగు రోజులు గా కురుస్తున్న వర్షాల వలన బురదమయంగా మారింది. పంచాయతీ కార్యాలయం సమీపాన ఉన్న ఖాళీ స్థలంలో పంచాయతీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సంత చిత్తడిగా మారి బురదలో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.కాగా, గ్రామ సర్పంచ్ తాత్కాలికంగా క్రీడాప్రాంగణం, కోట బురుజు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. శాశ్వతంగా సంత ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- నేలకొండపల్లి